Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org

# ఏం చదువులివి?

ఆర్థికంగా బలహీన వర్గాల వారికి ఉన్నత విద్యాసంస్థల్లో 10శాతం కోటా అమలుపరచేందుకంటూ కేంద్ర మంత్రిమండలి వెల్లడించిన నూతన నిర్ణయం మౌలిక సందేహాలు లేవనెత్తుతోంది. దేశవ్యాప్తంగా 158 కేంద్ర విద్యాసంస్థల్లో రెండులక్షలకు పైగా సీట్లను అదనపు రిజర్వేషన్ పద్దుకింద అందుబాటులోకి తేనున్నట్లు మంత్రిమండలి తీర్మాన పాఠం చాటుతోంది. ఇప్పటికే ఉన్న రిజర్వేషన్ల సదుపాయం వర్తించని వర్గాల్లోని పేదలకు విద్య, ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్లు కేటాయించడానికి ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లు ఈ ఏడాది మొదట్లోనే సార్వత్రిక రాజకీయ కాక రగిలించింది.రెండోదశ పోలింగుకు ముందు ఎన్నికల సంఘం అనుమతితో మంత్రివర్గ ఆమోదముద్ర పొందిన నిర్ణయం ప్రకారం- ప్రస్తుత విద్యా సంవత్సరంలో దాదాపు లక్షా 20వేలు, వచ్చే ఏడాది సుమారు 95వేల సీట్లను అదనంగా జోడించనున్నారు! ఆ మేరకు 10శాతం రిజర్వేషన్ల అమలు నిమిత్తం కేంద్ర విద్యాసంస్థలకు రమారమి రూ.4300కోట్ల నిధులూ మంజూరయ్యాయి. వాస్తవానికి దేశవ్యాప్తంగా 40వేల కళాశాలలు, తొమ్మిది వందల విశ్వవిద్యాలయాల్లో ఆర్థికంగా బలహీన వర్గీయులకు నిర్ణీత శాతం కోటా అమలు చేయదలచామని మూడు నెలల క్రితం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖామాత్యులు ప్రకాశ్ జావడేకర్ వెల్లడించారు. అందుకోసం అన్ని విద్యాసంస్థల్లోనూ కలిపి 33 లక్షల సీట్ల దాకా సృష్టించాల్సి ఉంటుందన్నది అప్పట్లో వెలుగుచూసిన అంచనా. లక్షల సంఖ్యలో అదనపు సీట్లు ఏర్పరుస్తామంటున్నారు సరే, బోధన సిబ్బంది మాటేమిటి? ఉన్నత విద్యాప్రమాణాల సాధనకు ఎటువంటి కార్యాచరణ ప్రణాళికను పట్టాలకు ఎక్కించదలచారు? గత జనవరి నాటి అధికారిక ప్రకటనలో గాని, కేంద్ర మంత్రిమండలి తాజా తీర్మానంలో గాని అందుకు సంబంధించి వివరణ అన్నదే కరవు!

కేంద్ర విద్యాసంస్థల్లో సీట్ల పెంపు యోచనకు ముందే సిబ్బంది నియామకాలపై లోతుగా దృష్టి సారించి ఉండాల్సింది. నిజానికి, ప్రతిష్ఠాత్మక ఐఐటీ (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లలో సైతం సరైన గురువులకు కొరత కొన్నేళ్లుగా వేధిస్తోంది. దిల్లీ, బాంబే, కాన్పూర్, మద్రాస్, రూర్కీ వంటి దిగ్గజ ఐఐటీల్లోనే వందల సంఖ్యలో అధ్యాపక ఖాళీలు పోగుపడి ఉన్నాయి. ఐఐటీలు, ఎన్ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లు, కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ పరిస్థితి ఏమంత సజావుగా లేదని నిరుడు ఆగస్టులో రాజ్య సభాముఖంగా ప్రభుత్వమే స్పష్టీకరించింది. ఈ సమస్య అక్కడికే పరిమితం కాలేదు. దేశంలోని లక్షలాది ఇంజినీరింగ్ కళాశాలల్లో బోధన సిబ్బందికీ నిత్య క్షామం తాండవిస్తోంది. దిద్దుబాటు చర్యలేమో ఎండమావుల్ని తలపిస్తున్నాయి! నిబంధనల ప్రకారం, ఏ ఐఐటీ అయినా గరిష్ఠంగా అయిదేళ్లపాటు విదేశీ అధ్యాపకుల్ని ఒప్పంద ప్రాతిపదికన నియమించుకోగల వీలుంది. ఖాళీల భర్తీకి అది సరైన పరిష్కార మార్గం కాదని సెలవిచ్చిన ఐఐటీ మండలి, శాశ్వతంగా విదేశీ బోధన సిబ్బందిని కొలువు తీర్చడమే శరణ్యమని ఇటీవల సూచించింది. అసంఖ్యాక విద్యార్థులు రేయింబవళ్లు సీటుకోసం శ్రమించే లబ్ధ ప్రతిష్ఠ సంస్థల్లోనే పెద్దయెత్తున అధ్యాపక ఖాళీలు వెక్కిరిస్తుండగా- ఆర్థికంగా బలహీన వర్గాలకు ఉద్దేశించిన అదనపు సీట్ల నిమిత్తం ఇప్పటికిప్పుడు గురువుల్ని ఎక్కడినుంచి ఎలా తీసుకురాదలచారో అగమ్యం!

వేదికలెక్కిన నేతలందరూ, దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉందని ఘనంగా ఉద్ఘాటించేవారే. వాస్తవంలో పునాది దశనుంచి అత్యున్నత స్థాయి వరకు విద్యార్థుల్ని తీర్చిదిద్దే సమర్థ గురువులకు తీరని కొరత కారణంగా దేశంలో చదువులు చట్టుబండలవుతుండటం తెలిసిందే. ప్రపంచంలోనే అత్యధికంగా పాఠశాలలకు వెళ్ళే పిల్లలు 25 కోట్లమంది నెలకొన్న దేశం మనది. ప్రాథమిక తరగతులు మూడు నాలుగింటికీ ఒకరిద్దరే వేర్వేరు సబ్జెక్టులు బోధించాల్సి రావడం ప్రమాణాలకు తూట్లు పొడుస్తోంది. అయిదో తరగతి విద్యార్థుల్లో కేవలం 44 శాతమే రెండో తరగతి పుస్తకం చదవగల స్థితిలో ఉండటం దిగ్భ్రాంతపరుస్తోంది. గణితం, విజ్ఞాన సాంఘిక శాస్త్రాలతోపాటు భాషల్లోనూ తెలుగు విద్యార్థుల మందకొడితనానికి ఉపాధ్యాయుల కొరతే పుణ్యం కట్టుకుంటోంది. తరతమ భేదాలతో తక్కిన రాష్ట్రాల్లోనూ విద్యార్థుల అభ్యసన సామర్థ్యం అంతంతమాత్రం కావడానికి 'ప్రాథమిక వైఫల్యాలే' కారణమవుతున్నాయి. ఈ దుర్బల పునాదులు పై తరగతుల్లో విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నట్లు రాష్ట్రాలవారీగా వార్షిక పరీక్షల ఫలితాలు

ఎలుగెత్తుతున్నాయి. పేరుగొప్ప పట్టాలు ఉద్యోగార్హత కల్పించలేక కోట్ల సంఖ్యలో యువత నిరాశానిస్పృహల్లో మగ్గిపోతూ, ఎంత చిన్న కొలువుకైనా బారులు తీరడం- దేశ విద్యారంగమే గాడి తప్పిందని నిరూపిస్తోంది. బాలబాలికల్లో సహజ ప్రతిభను వెలికితీసి సృజనశీలురుగా తీర్చిదిద్దే పాఠ్యప్రణాళికల కూర్పు- దేశ దీర్ఘకాలిక ప్రయోజనాల పరిరక్షణపట్ల నిబద్ధత కలిగిన ఏ ప్రజా ప్రభుత్వానికైనా ప్రథమ ప్రాధాన్యాంశం కావాలి. బడినుంచి విశ్వవిద్యాలయం వరకు, వృత్తి విద్యాసంస్థలు మొదలు ప్రతిష్ఠాత్మక బోధన సంస్థల దాకా అన్నింటా అత్యుత్తమ ఫలితాల సాధనకోసం మేలిమి ఉపాధ్యాయ విద్య సమకూర్చే విశిష్ట సంస్థ నొకదాన్ని సత్వరం అవతరింపజేయాలి. ఆకర్షణీయ వేతనాలు సమకూరుస్తూ అపార ప్రజ్ఞావంతుల్ని బోధన రంగంలోకి ఆహ్వానిస్తున్న దక్షిణ కొరియా, ఫిన్లాండ్ ప్రభృత దేశాల అనుభవాలనుంచి భారత్ ఇకనైనా గుణపాఠాలు నేర్వాలి. దేశంలో అత్యున్నత ఉపాధ్యాయ వ్యవస్థ నిలదొక్కుకోనిదే, ఇతోధిక సీట్ల తాలూకు నికర ప్రయోజనం రేపటి పౌరులకు దక్కదు!

Disclaimer: we collected these articles from Internet part of Social Awareness Campaign, we are thankful to the creators. We use for non-profit, free education purpose only. To know more, please visit: www.freegurukul.org